క్లుప్తంగా

ఎంపీడీఓకు సన్మానం



మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్యామ్‌సుందర్‌ను సోమవారం కారోబార్లు సన్మానించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కారోబార్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ విక్రమ్‌కుమార్, కారోబార్ సంఘం మండల అధ్యక్షుడు కసుకుల శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు అజ్మత్ అలీ, ప్రధాన కార్యదర్శి నార శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, బాపు, తిరుపతి పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

చిట్యాల: మండలంలోని పాశిగడ్డ తండాకు చెందిన లావుడ్యా బుజ్జమ్మ అక్రమంగా గుడుంబాను విక్రయిస్తుండగా సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎస్సై ఎండీ.శాఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాశిగడ్డతండాలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా బుజ్జమ్మ తన ఇంటివద్ద 10 లీటర్ల గుడుంబాను తయారు చేసి అదే గ్రామంలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. గుడంబాను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠినంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది యాకయ్య, నవీన్, అస్లామ్, మమత పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన బీజేపీ నాయకులు

టేకుమట్ల: ఇటీవల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన గోగికారి ప్రసాద్‌ను సోమవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బట్టల మొగిళి, దావు రఘు, పెరుమాండ్ల భిక్షపతి పాల్గొన్నారు.

జనక్ ప్రసాద్‌ను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్‌ను సోమవారం హైదరాబాద్‌లో భూపాలపల్లి ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జోగ బుచ్చయ్య ఆధ్వర్యంలో యూనియన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో యూనియన్ నాయకులు ధర్మపురి యూనియన్ మహిళా సెల్ అధ్యక్షురాలు శేషారత్నం, ఏరియా హాస్పిటల్ పిట్ సెక్రటరీ శశికళ ఉన్నారు.


పరామర్శ

టేకుమట్ల: మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన అడ్డూరి కార్తీక్ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, వంగ నరేష్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

చిట్యాల: మేత కోసం వెళ్లిన మేక విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందింది. బాధితుడు చిలుకల శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాలకు చెందిన శ్రీనివాస్ తన మేకల మందను తిర్మలాపూర్ శివారులోకి మేతకోసం తీసుకెళ్లాడు. మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి మేక అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపాడు. దీని విలువ రూ.18వేలు ఉంటుందన్నారు.

చికిత్స పొందుతున్న కౌలు రైతు మృతి



శంకరయ్య(ఫైల్)

మల్హర్: ఓ కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇప్పల్లిలో జరిగింది. కొయ్యూరు ఎస్సై నరేష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన శంకరయ్య (52) మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశాడు. రూ. లక్ష అప్పు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టాడు. పంట చేతికందే సమయానికి దిగ్గుబడి సరిగా రాలేదు. అలాగే, తన ఆటోకు సైతం ఫైనాన్స్ కిస్తీలు చెల్లించడం లేదు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితం మీద విరక్తి చెంది మనస్తాపంతో ఈనెల 15వ తేదీన గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నాకి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఈ 17 న మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోర్డుపై హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



రేగొండ: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



గణపురం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



చిట్యాల : పరీక్షకు హాజరైన విద్యార్థులు

మల్హర్: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలు, మల్లారం కస్తూర్బా, ఎడ్లపల్లి మోడల్ స్కూల్ పాఠశాలకు చెందిన 166 మంది విద్యార్థులకు 165 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని కొయ్యూరు ఎస్సై నరేష్ పరిశీలించారు.

మహాముత్తారం: మొదటి రోజు 159 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్షకేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై మహేంద్రకుమార్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిట్యాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం 158 మందికి గాను 158 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎండీ.సాధిక్ తెలిపారు. అలాగే గురుకుల పాఠశాలలో 180 మందికి 180 విద్యార్థులు హాజరైనట్లు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ గోల్కొండ భిక్షపతి తెలిపారు.

గణపురం : మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా తొలి రోజు 408 మందికి గాను 405 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ రఘుపతి తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 241 మందికి ముగ్గురు గైర్హాజరు కాగా, చెల్పూరు ఉన్నత పాఠశాలలో 167కి గాను 167 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరిటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్సై మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ మురళీధర్ రావు, ఎంపీడీఓ భాస్కర్, పరీక్షల అధికారి భద్రయ్యలు తనిఖీ చేశారు.

రేగొండ: మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రేగొండలో 220 మంది, రంగయ్యపల్లిలో 116 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ వేల్పుల ప్రభాకర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహదేవ్‌పూర్: మండల కేంద్రంలోని పాఠశాలల కాంప్లెక్స్‌లో రెండు కేంద్రాల్లో పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని మొత్తం 8 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు, జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో 197 మంది విద్యార్థులకు 196 మంది పరీక్ష రాశారు. జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో 200 మందికి గాను 199 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసినట్లు హెచ్ఎంలు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ ప్రహ్లాద్, ఎస్సై ప్రసాద్ సందర్శించారు.

పరీక్షా కేంద్రాల వద్ద అమలుకాని 144 సెక్షన్

మహదేవపూర్: రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారులు స్పందించి 144 సెక్షన్ పూర్తి స్థాయిలో అమలు చేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

టేకుమట్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పది పరీక్షల్లో 148 మంది విద్యార్థులకు గానూ 148 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ కోడెపాక రఘుపతి తెలిపారు. పది పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కాటారం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. కాటారం జెడ్పీహెచ్ఎస్‌లో 200 మంది విద్యార్థులకు 199 మంది, టీటీడబ్యూకలఆర్‌జేసీ(బాలుర) పరీక్షా కేంద్రంలో 220 మంది, ఆదర్శ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 157 మంది విద్యార్థులకు గాను 156 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మాస్ కాపీయింగ్‌కి అవకాశం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగుళ్లపల్లి: మండలంలో మొట్లపల్లి, ముగుళ్లపల్లిలో గ్రామాల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 296 మంది విద్యార్థులు ఉండగా సోమవారం పరీక్షకు 295 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు.



మహదేవపూర్: పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



టేకుమట్ల: పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



కాటారం : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

రేగొండ: మండలంలోని నాగుర్లపల్లి మాజీ సర్పంచ్ కుంట తిరుపతి, కనిపర్తికి చెందిన బల్గూరి కొనరావుతో పాటు మరో 50 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పున్నం రవి, సూరం వీరేందర్, గూటోజ్ కిష్టయ్య, పట్టెం శంకర్, బండారి దేవేందర్, వినోద్ కుమార్, సుదర్శన్, తిరుపతి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పట్టించుకోని అధికారులు

రేగొండ : మండలంలోని చలివాగు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అనుమతులు లేకుండా పగలు, రాత్రి ట్రాక్టర్లలో ఇసుక రవాణా అవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని కనిపర్తి శివారులోని చలివాగు నుంచి ఇష్టారీతిన అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్లలో కూలీల సహాయంతో పోస్తూ నిత్యం ఇసుకను తీసుకెళ్తున్నారు. కొన్ని నెలలుగా అక్రమ ఇసుక రవాణా దందా కొనసాగుతోంది. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మహాముత్తారం: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ సబ్ ఇంజనీర్ కొమురయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో లో ఓల్టేజీ హెచ్చు తగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, నూతన సర్వీస్ మంజూర్ తదితర అంశాలపై చర్చించడం జరుగుతందని తెలిపారు. సమావేశానికి టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఫిర్యాదులను వినియోగదారులు రాత పూర్వకంగా ఈ సదస్సులో అందజేయాలని సూచించారు. సదస్సు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని తెలిపారు.

రాధికకు ఎంపవర్డ్ ఉమెన్ అవార్డు




అవార్డు అందుకుంటున్న రాధిక

కాటారం : సేవ్ ద గర్ల్ చైల్డ్, ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంపవర్డ్ ఉమెన్ అవార్డును మండలంలోని రేగులగూడేనికి చెందిన పులి రాధిక అందుకుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సాధికారిత -2024 అవార్డును సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ నిర్వాహకులు చంచల్‌గూడ జైలు సూపరిండెంట్ శివకుమార్‌గౌడ్, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ చేతుల మీదుగా అందజేశారు. రాధిక కరోనా సమయంలో చేసిన సేవలతో పాటు ఆడపిల్ల చైతన్యం గూర్చి పాడిన పాటను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రాధికతో పాటు యూట్యూబ్ ఫేం గంగవ్వ, ఇతర రంగాల్లో రాణించిన మహిళలకు అవార్డులను అందజేశారు. రాధిక అవార్డు అందుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రహదారిపై ఇసుక కుప్ప

- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం
- రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



కాళేశ్వరం: రెండు రోజుల కిందట మల్హర్ మండలం తాడిచర్ల క్వారీల నుంచి జీరో దందా సాగిస్తూ పట్టుబడ్డ టిప్పర్‌లు రోడ్డుపై ఇసుకను డంప్ చేసి పరారైన విషయం తెలిసిందే. ఆ ఘటన మరువక ముందే మహదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలోని జాతీయ రహదారి 353(సీ)రోడ్డుపైన గ్రావిటీకాల్వ సమీపంలో సోమవారం రాత్రి ఇసుక మాఫియాకు చెందిన ఓ టిప్పర్ ఎలాంటి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తూ తనిఖీలు జరుగుతున్నాయని భయపడి ఆన్‌లోడ్ చేసినట్లు సమాచారం . దీంతో కాళేశ్వరం పరిధిలో కూడా జీరో దందా సాగుతోందని తెలుస్తోంది. అధికారుల తనిఖీలు ఎక్కువగా ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్‌లోడు ఇసుకను రోడ్డుపక్కన ఆన్‌లోడ్ చేసి పరారైనట్లు తెలుస్తోంది. అధికారులు ఆ టిప్పర్ ఎవరిది.. ఏ క్వారీ నుంచి వచ్చిందో గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. టీఎస్ఎండీ అధికారులు మాత్రం మౌనం వీడడం లేదు. వారి కనుసన్నల్లోని అంతా జరుగుతున్నా కట్టడి చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. దీంతో జీరో దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టీఎస్ఎండీసీ పీఓ స్థాయి అధికారి మాత్రం అంతా తెలిసినా గమ్మునుంటుండడం వెనుక మతలబు అర్థం కావడం లేదు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నా చర్యలు కానరావడం లేదు. అలవాటుకు మరిగిన ఇసుక మాఫియాను నడ్డి విరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ, పోలీస్, ఆర్టీఏ, మైనింగ్‌తో పాటు సంబంధిత అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



టేకుమట్ల : అంగన్‌వాడీలో కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



సీమంతం చేయిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

రేగొండ (కొత్తపల్లిగోరి): గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. పోషణపక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపల్లిగోరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు, పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసే వంటకాలు తినడం అలవాటు చేసుకోవాలని, స్థానికంగా లభించే తాజా కూరగాయలు, ఆకుకూరల్లో సైతం అనేక పోషకాలుంటాయని వివరించారు. శిశువుకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని, ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అస్మా, ఏఎన్ఎం అనసూయ, అంగన్‌వాడీ టీచర్లు రజిత, సునీత, రమ, శ్యామల, రత్న ఆశ కార్యకర్తలు కల్పన, లలిత, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి) అంగన్‌వాడీ కేంద్రం 1, 2లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన అధ్యక్షతన అంగన్‌వాడీ టీచర్లు వనిత, స్వరూప ఆధ్వర్యంలో పోషణ పక్వాడలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండలంలోని రాపల్లికోటలో పోషణ పక్వాడ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సూపర్‌వైజర్ రమాదేవి హాజరై మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 23 వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించినట్లు చెపఆపరు. కార్యక్రమంలో టీచర్ శ్రీదేవి, సమ్మక్క, ఆశ వర్కర్ తదితరులు

కాళేశ్వరం: కాళేశ్వరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం సీడీపీఓ రాధిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3-6 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని అన్నారు. పిల్లల్లో పుట్టగానే ముర్రుపాలు తాగించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలన్నారు. అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు చేయించారు. కార్యక్రమంలో శైలజ, కళావతి, రాజమణి, అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం : అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ రాధిక



మహదేవపూర్ : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి

పరిహారం చెల్లించాలని రైతుల ధర్నా



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

భూపాలపల్లి అర్బన్ : సింగరేణి ఓసీ ప్రాజెక్ట్-2లో భూములు కోల్పోయిన తమకు వెంటనే పరిహారం చెల్లించాలంటూ ఆకుదారివాడ, ఫక్కరుగడ్డ గ్రామాల రైతులు ఓసీ-2, 1ఇంక్లైన్ రోడ్డుపై బైఠాయించారు. దీంతో రోడ్డుపై బొగ్గు లారీలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ.. ఏడేళ్ల క్రితం సింగరేణి యాజమాన్యం ఓసీ-2 కోసం తమ భూములు స్వాధీనం చేసుకుందని అప్పటి నుంచి ఇప్పటి వరకు తమకు పరిహారం చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి తమను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో ఓసీ-2 గనిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కాగా విషయం తెలుసుకున్న సింగరేణి జీఎం బళ్లారి శ్రీనివాస్ మీడియా సమక్షంలో ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు ఈ నెల 25వ తేదీలోపు సింగరేణి సీఎండీతో చర్చించి మాట్లాడిస్తానని హామీ ఇచ్చారు. రైతులు బుర్ర రమేష్‌గౌడ్, రాజయ్య, అనిల్, సెగ్గం శంకర్, ఎల్లారం, ఎస్కే యాకూబ్, కోల రాయమల్లు, బుర్ర మనోజ్, ఇస్లావత్ హాథీరాం నాయక్, ఇస్లావత్ సమ్మయ్య, భీమనపల్లి మహేందర్, బుక్క రవి, దాస్యం రవికుమార్, కంచర్ల బాలయ్య, రాజేందర్ నాయక్, ఇస్లావత్ సమ్మయ్య, ఇస్లావత్ బాలు నాయక్, గుర్రం కిష్టయ్య, కెక్కర్ల మధున, మేడిపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



ప్రకాష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

టేకుమట్ల: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్‌రెడ్డికి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట నాయకులు బండ శ్రీకాంత్, వంగ నరేష్, చిరంజీవి ఉన్నారు.